కళాశాల లేక.. చదువు సాగక

- మండల కేంద్రంలో కళాశాల లేక విద్యార్థుల అవస్థలు
- ఆదేశాలు ఉన్న పట్టించుకోని అధికారులు



కృష్ణా మండల కేంద్రం

కృష్ణా: మండల కేంద్రంలో బాలుర జూనియర్ కళాశాల లేకపోవడం మూలంగా కృష్ణా మండలంలోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని కున్సీ, గుడెబల్లూర్, ముడుమాల్, కృష్ణా గ్రామాల్లో ఉన్నత పాఠశాలలు ఉన్నప్పటికీ ప్రభుత్వ జూనియర్ కళాశాల మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో ఇక్కడ పదోతరగతి పూర్తి చేసుకున్న వందలాది మంది విద్యార్థులు పై చదువుల నిమిత్తం ఇతర పట్టణాలకు వెళ్తుంటారు. ముఖ్యంగా మాగనూర్ అలాగే మక్తల్ మండల కేంద్రంలోని కళాశాలకు వెళ్లాల్సి వస్తుంది. అయితే మాగనూర్‌కు వెళ్లాలంటే సొంత వాహనాలు లేదా ప్రైవేట్ వాహనాలలో వెళ్లాల్సి రావడంతో ఆర్థికంగానూ ఇబ్బందులు తప్పడం లేదు. అదే మండలకేంద్రంలో కళాశాల ఏర్పాటు చేస్తే తమకీ ఇబ్బందులు తప్పుతాయని విద్యార్థులు వాపోతున్నారు.

100 మందికిపైగా విద్యార్థులు..

మండలంలోని పలు గ్రామాల నుంచి దాదాపు రోజూ 100 మందికి పైగా విద్యార్థులు మాగనూర్, మక్తల్‌కు వెళ్లి ఇంటర్ చదువుతున్నారు. రోజూ తిరగలేక కొంతమంది అక్కడే గదులు అద్దెకు తీసుకొని చదువులు కొనసాగిస్తున్నారు. ఇక అమ్మాయిలు అయితే వేరే ఊర్లకు వెళ్లలేక నూటికి 90 శాతం మంది పదో తరగతితోనే చదువు ఆపేస్తున్నారు. కొంతమంది మాత్రం అవస్థలు పడుతూనే చదువులు సాగిస్తున్నారు. అదే మండల కేంద్రంలో కళాశాలను ఏర్పాటు చేసినట్లయితే ఈ ప్రాంత విద్యార్థులకు ముఖ్యంగా బాలికలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ విషయంపై పలు మార్లు మండల నాయకులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనా ప్రభుత్వ అధికారులు స్పందించి కృష్ణా మండలం కేంద్రంలో విద్యాభివృద్ధికి జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తే 10వ తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్కరు ఇంటర్ చదివేందుకు అవకాశం ఉంటుంది. ఇక్కడ కాలేజీ లేకపోవడంతో ఇంటర్ చదివేందుకు మాగనూర్‌కు లేదా మక్తల్‌కు వెళ్లాలి. దీంతో వేరే ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక అనేకమంది మధ్యలోనే మానేస్తున్నారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

–గాయిత్రి, గుర్జాల్ గ్రామం, కృష్ణా మండలం

అధికారులు స్పందించాలి



కృష్ణా మండలం రాష్ట్ర సరిహద్దులో ఉండడంతో అధికారులు ఇక్కడి సమస్యలపై దృష్టి సారించడం లేదు. ముఖ్యంగా ఇక్కడ కళాశాల ఏర్పాటు చేయకపోవడంతో అమ్మాయిలను వేరే ఊర్లకు వెళ్లి చదువుకోలేక పదో తరగతితోనే ఆపేస్తున్నారు. తమ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తే బాలికలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

–పవన్‌కుమార్, కుసుమర్తి గ్రామం

సమస్య పరిష్కారానికి కృషి



మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. కళాశాల ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. ముఖ్యంగా కుటుంబాల ఆర్థిక వృద్ధికి బాలికలు చదువుకోవడం తప్పనిసరి. బాలికలు మధ్యలోనే చదువు మానేయకుండా మండలకేంద్రంలో కళాశాల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటా.

–నిజాముద్దీన్, ఎంఈఓ, కృష్ణా మండలం

విద్యుత్ స్తంభాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..


విద్యుత్ స్తంభాలను తొలగిస్తున్న సిబ్బంది

కొత్తపల్లి: మండలంలోని ప్రధాన రహదారిపై అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను అధికారులు తొలగించాలి. ఈ నెల ఒకటో తేదీన సాక్షి దినపత్రికలో 'విద్యుత్ స్తంభాలను తొలగించాలి' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు బుధవారం స్పందించారు. విద్యుత్ ఏఈ బాల్‌రాజ్ ఆదేశాల మేరకు సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డుపై రాకపోకలకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ వాహనదారులకు ఇబ్బందులు లేకుండా రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించినట్లు తెలిపారు. అలాగే రోడ్లకు ఆనుకొని రైతులు అమర్చుకున్న విద్యుత్ నియంత్రికలను, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించుకోవాలని సూచించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : కలెక్టర్

నారాయణపేట: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఎన్నికల వ్యయ గరిష్ట పరిమితి కంటే ఎక్కువ ఖర్చు చేస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచి అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు బుధవారం కలెక్టరేట్‌లోని వీసీహాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషనర్ నిర్దేశించిన నిబంధనల మేరకే అభ్యర్థులు ఖర్చు చేయాలన్నారు. జెడ్పీటీసీ అభ్యర్థి గరిష్ట పరిమితి రూ.4 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థి రూ.1.50 లక్షలు, సర్పంచి అభ్యర్థుల గరిష్ట పరిమితి రూ.2.50 లక్షలన్నారు. (5వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలో) అంతలోపు జనాభా ఉన్న పంచాయతీలలో రూ.1.50 లక్షలు మాత్రమే అని, దీనిని అనుసరించి ఆయా గ్రామ పంచాయతీలలో వార్డు అభ్యర్థులు ఎన్నికల వ్యయ గరిష్ట పరిమితి రూ.30 నుంచి రూ.50 వేలు ఉంటుందని వెల్లడించారు. ఎన్నికల వ్యయ గరిష్ట పరిమితికి మించి ఖర్చు చేసిన అభ్యర్థి ఒకవేళ గెలిచినా డిస్ క్వాలిఫై అవుతారని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి

పీఎండీడీకేవై కార్యక్రమానికి జిల్లా ఎంపికైనందున అధికారులందరూ సమన్వయంతో పనిచేసి త్వరలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. 'ప్రధానమంత్రి ధన్- ధాన్య కృషి యోజన' కార్యక్రమంపై కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్ వారి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని లక్ష్యాలను వివరించారు. ఈ పథకంలో వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, నీటిపారుదల సౌకర్యాలను మెరుగుపరచడం, దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణ లభ్యతను సులభతరం చేయడం జరుగుతుందన్నారు. అలాగే అన్ని శాఖల సమన్వయం కోసం చేయవలసిన యాక్షన్ ప్లాన్, విధివిధానాలను ఉద్యోగులకు వివరించారు.

క్లుప్తంగా

రుణాల రెన్యువల్ కోసం రైతుల పాట్లు

నర్వ: మండల కేంద్రంలోని టీజీవీబీలో వ్యవసాయ రుణాల రెన్యువల్ కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇటీవల నూతన ఫీల్డ్ ఆఫీసర్ బ్యాంకుకు రావడంతో రెన్యువల్ చేయడంలో ఆలస్యం చేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మేనేజర్ శ్రీకాంత్‌ను వివరణ కోరగా నూతన ఫీల్డ్ ఆఫీసర్ నిదానంగా చేస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అలాగే గతేడాది రైతులందరూ సెప్టెంబర్, అక్టోబర్‌లో రెన్యువల్ చేసుకోగా ప్రస్తుతం ఒకే సారి వస్తుండడంతో మరింత ఆలస్యమవుతున్నట్లు పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



మరికల్: మండలంలోని ఇబ్రహీంపట్నం నుంచి మల్యానాయక్‌తండా, పర్నకుంటతండా, ఫర్దీపూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి ఇది. దశాబ్దాల నుంచి ఇబ్రహీంపట్నం మీదుగా ఈ డొంగు బాటే ఆ గ్రామాలకు దిక్కు. రహదారి చుట్టూ ముళ్ల పొదలు అల్లుకుపోవడమే కాకుండా గుంతలుగా మారడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో గత పదేళ్ల నుంచి ఈ తండాల ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. రహదారిని బీటీ రోడ్డుగా మార్చాలని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని మూడు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ కష్టాలు తీర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బంతి పూల సాగుతో అధిక ఆదాయం



మరికల్: ప్రస్తుతం పండుగల సీజన్ కావడంతో కొందరు రైతులు ఉన్న కొంత పొలంలో బంతి పూలను సాగు చేస్తూ మంచి ఆదాయం ఆర్జిస్తున్నారు. మరికల్‌కు చెందిన పొల్లేమోని లక్ష్మయ్య, లక్ష్మి దంపతులు తమకున్న అర్ధ ఎకరాలో రూ.30 వేలు ఖర్చు చేసి బంతిపూల సాగు చేపట్టారు. పంటకు చీడపీడలు వ్యాపించకుండా ఉద్యానశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తున్నారు. అధికారుల సూచన మేరకు పూల విత్తనాలు ఎంపిక చేసుకొని మొలకలు వచ్చేలా సాగు చేస్తున్నారు. దసరా, దీపావళి, కార్తీక మాసంలో బంతిపూలకు మంచి గిరాకీ ఉంటుంది. ఈ క్రమంలో పూల డిమాండ్‌కు అనుగుణంగా పంట చేతికందేలా చర్యలు చేపట్టడంతో అధిక ఆదాయం ఆర్జిస్తూ లాభాలు గడిస్తున్నారు.

ఘనంగా భజరంగ్‌దళ్ ఆవిర్భావ దినోత్సవం



నారాయణపేట రూరల్/నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో భజరంగ్‌దళ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సెంటర్ చౌక్‌లో కాషాయ పతాకావిష్కరణ నిర్వహించి భజరంగ్‌దళ్ ఆవిర్భావం గురించి ఉపన్యాసించారు. యువత భజరంగ్‌దళ్‌లో చేరి సేవ, సురక్ష, సంస్కృతి తదితర లక్ష్యాన్ని సాధించాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కన్నా శివకుమార్, భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ శ్రవణ్ కుమార్, జిల్లా గోరక్ష ఇంచార్జి సందీప్, విహెచ్పి పట్టణ కార్యదర్శి ప్రవీణ్, రామకృష్ణ, సతీష్, ఆకాష్, రవి, విజయ్, అనిల్, రాజు, రవి, శ్రీనివాస్, లక్ష్మణ్, కృష్ణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ఆత్మకూర్: ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన సంఘటనలో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. ఆత్మకూర్ పట్టణంలో భార్గవినగర్‌లో నివాసముంటున్న ముష్టి విష్ణువర్ధన్ హోటల్ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు. ఈ నెల 7న సాయంత్రం పనిమీద బయటకు వెళ్లి వస్తానని ఇంటినుంచి పోయిన విష్ణు బుధవారం వరకు తిరిగి రాలేదన్నారు. బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదని వివరించారు. ఈ క్రమంలో భార్య పల్లవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి


మాట్లాడుతున్న పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూరు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మద్దూరు, కొత్తపల్లి మండలాల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పు ఏ విధంగా వెలువడిన బీఆర్ఎస్ పార్టీ తరపున బీసీలకు 50 శాతం సీట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ చేసినా మోసాలను ప్రజలు వివరించి అధికస్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. అనంతరం ఎర్రగుంట తండా, దమ్‌గాన్‌పూర్ గ్రామాలకు చెందిన నాయకులు పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు సలీం, గోపాల్, మదుసూదన్‌రెడ్డి, వీరారెడ్డి, శివకుమార్, బసప్ప, బాల్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

రమేష్‌నాయక్‌ను వెతికి పట్టుకోవాలి

మద్దూరు మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ నాయకులు తాజోద్దీన్, యాసీన్‌ల వేధింపులు తాళలేక సూసైడ్ నోట్ రాసి వెళ్లిపోయిన రమేష్ నాయక్‌ను పోలీసులు వెతికి పట్టుకోవాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.రమేష్ నాయక్ అదృశ్యమై 10 రోజులు గడుస్తున్నా పోలీసులు ఏలాంటి చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. నిందితులను అరెస్ట్ చేసి రమేష్‌నాయక్, రాంచంద్రయ్య కుటుంబాలను ఆదుకోవాలన్నారు. లేకపోతే ఆందోళన చేపడతామన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మరికల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కన్మనూర్, జిన్నారం, చిత్తనూర్, ఎక్లాస్‌పూర్, బూడేగానితండాల్లో బుధవారం ఆయన పర్యటించి ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. ఇందుకోసం నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజవర్ధన్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'108' ఉద్యోగులకు అవగాహన సదస్సు


మాట్లాడుతున్న రవికుమార్

నారాయణపేట: అత్యవసర సమయాల్లో సాయం కోసం 108కు కాల్ చేస్తే వెంటనే స్పందించాలని ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవికుమార్ అంబులెన్స్ సిబ్బందికి సూచించారు. జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్న 108,102 సిబ్బందికి.. ప్రజలకు అందించాల్సిన సేవలపై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో రోడ్డు ప్రమాద బాధితులకు, గర్భిణులు, పాము కాటు బాధితులు ఎవరైనా వైద్య సాయం కోసం కాల్ చేస్తే వెంటనే ఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అనంతరం దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. అవగాహన సదస్సులో జిల్లా సూపర్‌వైజర్ రాఘవేంద్ర, 108 సిబ్బంది పాల్గొన్నారు.

అద్దె చెల్లించలేదని పాఠశాలకు తాళం



పాఠశాలకు తాళం వేసిన యాజమాని

మక్తల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు భవనం యజమాని బుధవారం తాళం వేశాడు. కొందరు సంగంబండ రోడ్డు వైపు ఓ భవనాన్ని అద్దెకు తీసుకొని కేరళ పాఠశాలను నిర్వహిస్తున్నారు. అయితే ఏడాది నుంచి భవనానికి సంబంధించిన అద్దె చెల్లించలేదు. దీంతో విసుపోయిన యజమాని పాఠశాలకు తాళం వేశాడు. పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి వరకు 600 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దసరా సెలవులు పూర్తి అయినప్పటికీ పాఠశాల తెరుచుకోలేదు. పాఠశాలకు తాళం వేసి ఉండడంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆరా తీయగా సదరు విషయం బయటికొచ్చింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏంఈఓ అనిల్ గౌడ్‌ను వివరణ కోరగా విషయాన్ని డీఈఓ గోవిందరాజులు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. డీఈఓ ఆదేశాల మేరకు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు.

పరిమితికి మించి నగదు తీసుకెళ్లొద్దు

అమరచింత: స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనల్లో భాగంగా పరిమితికి మించి నగదు తీసుకెళ్లొద్దని ఎస్ఐ స్వాతి సూచించారు. అధికారుల సూచన మేరకు మండలంలోని నాగల్‌కడ్మూర్ గ్రామంలో నారాయణపేట జిల్లా సరిహద్దులో బుధవారం పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ రూ.50 వేల కంటే అధికంగా నగదు తీసుకెళ్తుంటే దానికి సంబంధించి పత్రాలు చూపించాలన్నారు. ఆధారాలు చూపించని పక్షంలో నగదును సీజ్ చేస్తామని పేర్కొన్నారు. వాహనదారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

కొత్తపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల ప్రాదేశిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో నేటి నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసిల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు కొత్తపల్లి ఎంపీడీఓ కృష్ణారావ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 5 ఎంపీటీసీలు ఒక జెడ్పీటీసీ స్థానానికి రెండు క్లస్టర్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్తపల్లి, నిడ్జింత ఎంపీటీసీలు కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో భూనీడు,గోకుల్‌నగర్, దుప్పటి గట్టుకు సంబంధించిన ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్లు దుప్పటిగట్టు పంచాయతీ కార్యాలయంలో స్వీకరించినున్నట్లు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



నారాయణపేట టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావ్ నామాజీ అన్నారు. అండర్-15 విభాగంలో హెచ్‌సీపీ ప్రొబబుల్‌కు ఎంపికైన నారాయణపేట విద్యార్థిని బుధవారం ఆయన అభినందించారు. క్రీడల్లో రాణించడం వల్ల భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని అలాగే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటామన్నారు. నారాయణపేట అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ, క్రికెట్ కోచ్ అజయ్, సీనియర్ క్రీడాకారుడు అశోక్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్మన్ నర్సయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు వార్డులలో ఉన్న చెత్తాను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. అదే విధంగా ఇటీవల దుర్గా మాత నిమజ్జనం సందర్భంగా స్థానిక కొండారెడ్డి పల్లి చెరువు దగ్గర అశుభ్రంగా మారిన పరిసరాలను శుభ్రం చేయించి, నీటిలో పేరుకుపోయిన పూళ్లు, తదితర వ్యర్థాలను తీయించి శుభ్రం చేయించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నారాయణపేటను స్వచ్ఛ పట్టణంగా తీర్చి దిద్దడంలో ప్రజలు కూడా సహకరించాలన్నారు.

కబడ్డీ జట్టుకు ఎంపిక

అమరచింత: పట్టణానికి చెందిన రాజు ఎస్‌జీఎఫ్ అండర్-19 కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు కోచ్ జిలానీ బుధవారం తెలిపారు. ఇటీవల ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో జరిగిన అండర్-19 కబడ్డీ ఎంపికలో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడన్నారు. త్వరలో వరంగల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా అఖండ జ్యోతుల ఊరేగింపు


అఖండ జ్యోతిని ఊరేగిస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని బాపునగర్ తోగట వీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం అఖండ జ్యోతుల ఊరేగింపు వైభవంగా జరిగింది. పట్టణ పురవీధుల మీదుగా ఖడ్గ విన్యాసలతో నందికోలు ఆటలతో భజన పాటలతో చౌడేశ్వరి మాత దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారికి మహా అభిషేకం, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలతో పాటు మహామంగళహారతి నిర్వహించి భక్తులకు సర్వదర్శనం, తీర్థప్రసాద వితరణ చేశారు. భక్తులు తోట వీర క్షత్రియ సేవాసంఘం, సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తులకు అన్నదానం


జాజాపూర్‌లో అన్నదానం చేస్తున్న సభ్యులు

మండల పరిధిలోని జాజాపూర్ గ్రామంలోని అంబ భవాని దేవాలయంలో ఎస్ ఎస్ కే సమాజ్ ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా అమ్మవారికి దసరా నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి పూజలు జరిపించారు. అంతకుముందు అర్చకుల మంత్రోచ్చరణలతో మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో సమాజం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


మద్దూరులో అమ్మవారి బోనాల ఊరేగింపు

మద్దూరు: పట్టణంలో కాచెరువు కట్టపై మూడు రోజులుగా కొనసాగుతున్న కట్ట మైసమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం బోనాలతో ముగిసింది. మొదటి రోజు విగ్రహం ఊరేగింపు, రెండ రోజు గణపతి, అమ్మవారి హోమాలు, పుణ్యావచనం, నవగ్రహ పూజలు, అమ్మవారికి ధాన్య, జల, శయ్యాదివాసాలు నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున యంత్ర ప్రతిష్ఠాపన అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేద పండితులు రాఘవేంద్రచారి బృందం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాల ఊరేగింపు కొనసాగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకట్‌రాములు, ప్రకాష్, మహిపాలా, భీంసేన్, రామకృష్ణ, వెంకటప్ప, నర్సిములు, ఉసేనప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన


సమావేశమైన అధికారులు, నాయకులు

ధన్వాడ: ధన్వాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఎస్. భారతి నామినేషన్ల దాఖలు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు అలాగే డిపాజిట్ వివరాలు, ఎన్నికల కమిటీ నిబంధనల గురించి వివరించారు. అనంతరం బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఓటర్ల జాబితా వెంటనే మండల పార్టీ అధ్యక్షులకు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ జయప్రకాష్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు మాజీ ఎంపీటీసీలు ఉదయభాను, ఉమేష్‌కుమార్, మల్లయ్య, గోవర్ధన్‌గౌడ్, అఖిలపక్షం నాయకులు మల్లేష్‌గౌడ్, ఇర్ఫాన్, శివరాజ్, సురేందర్, రాఘవేంద్రరెడ్డి, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దారి కష్టాలు తీరేదెన్నడో..!



మండల పరిధిలోని మాగనూర్ హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రజలు కాలనీకి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్డు మొత్తం బురద, మురుగుమయంగా మారడంతో నరకయాతన పడుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నికల సమయంలో మాత్రమే ఇక్కడ కాలనీ ఉందని గుర్తుకు వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం స్థానిక ఎన్నికలు వస్తుండడంతో ఓట్లు ఎలా అడుగుతారో కాలనీకి వస్తే నిలదీస్తామంటూ మండిపడుతున్నారు. ఇప్పటికై నా స్పందించి కాలనీకి వెళ్లే దారిని బాగు చేయాలని కోరుతున్నారు.

- మాగనూర్